ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 28 : ఏకాగ్రతతో చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి అన్నారు. శుక్రవారం కొండపాక మండలంలోని శ్రీ ఆనంద నిలయంలోని నిశాంత్ ఆనంద బాలసదన్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలసదన్‌లో ఉంటూ టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 9.5జీపీఏ సాధించిన విద్యార్థులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్‌తో కలిసి ఆయన సన్మానించడంతో పాటు ఒక్కో విద్యార్థికి రూ.25 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి మంచి పేరు తీసుకురావడానికి శ్రమించాలని సూచించారు. మెరుగైన విద్యను అందించిన కొండపాక హైస్కూల్ ఉపాధ్యాయులను అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి, చిత్రంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్, జూన్ 28: వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎన్సీ.రాజమౌళి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షపు నీళ్లు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణకు పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో 20అంశాలకు 19అంశాలతో పాటు టెబుల్ ఏజెండా మూడు అంశాలను ఆమోదించారు. మిగిలిన అంశాలను వాయిదా వేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కమిషనర్ నర్సయ్య, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజమౌళి

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, జూన్ 28: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కో ఎడ్యుకేషన్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, సంస్కృతం, తెలుగు, కంప్యూటర్ సైన్స్, గణితం, మైక్రో బయాలజీ సబ్జెక్టుల్లో బోధించడానికి అర్హులైన వారు వచ్చే నెల 2లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. జూలై 4న నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేట అర్బన్, జూన్ 28 : సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ (1), తెలుగు (1), మాథ్స్ (1), హిస్టరీ (1), ఎకనామిక్స్ (1), కామర్స్ (2), కంప్యూటర్స్ (1) సబ్జెక్ట్‌ల్లో ఖాళీలు ఉన్నాయని.. ఆసక్తి గల వారు జూలై 2వ తేదీలోపు తమ దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించండి

ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన రాజమౌళి, కౌన్సిలర్లు

గజ్వేల్, జూన్ 28: గజ్వేల్ పట్టణ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఆర్డీవో బన్సీలాల్‌ను కలిసి వినతిపత్రాన్ని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ఆధ్వర్యంలో అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేసే విధంగా కలెక్టర్‌తో మాట్లాడి చొరవచూపాలన్నారు. అద్దె ఇండ్లలో నిరుపేదలు ఉండడంతో ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారన్నారు. సానుకూలంగా స్పందించిన ఆర్డీవో కలెక్టర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు బాలేష్, మెట్టయ్య, శ్రీనివాస్, రజిత, బాలామణి, రహీం, చందనారవీందర్, వరలక్ష్మీ కనకయ్య, దుర్గాప్రసాద్, చందు, కో–ఆప్షన్ సభ్యుడు ఉమర్ పాల్గొన్నారు.

న్యాయం చేయండి సారూ..

తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న అంతయగూడెం రైతులు

జగదేవ్‌పూర్ జూన్28: తమ భూమి తమకు తిరిగి పట్టా చేసేలా అధికారులు, నాయకులు చొరవ చూపి న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం మండలంలోని అంతాయగూడెం గ్రామానికి చెందిన రైతులు పూర నర్సయ్య, కొండయ్య కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దారు కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని 164 సర్వే నంబర్‌లోని రెండు ఎకరాల భూమిని అరవై ఏండ్లుగా తమ తాతలు, తండ్రులు కబ్జాలో ఉండి భూమిని సాగు చేసుకుంటుండటంతో పాటు పహణీలో కూడా వచ్చిందన్నారు. ఇటీవల తమ భూమి పహణీలో కట్‌కావడంతోపాటు గ్రామానికి చెందిన తీగుల్లకిష్టయ్య పేరు మీద వచ్చేలా మార్పు చేసుకున్నారన్నారు. గ్రామ మాజీ సర్పంచ్, మరో ఇద్దరు నాయకులు తమ భూమిని మా పేరు మీద పట్టా చేయిస్తామని చెప్పి నమ్మించి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, ఆర్డీవోను కలిశామన్నారు. అధికారులు స్పందించి విచారణ చేపట్టి తమ భూమి తమకు వచ్చేలా చొరవ చూపాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తామన్నారు.

హాస్టల్ విద్యార్థులకు అందని పుస్తకాలు, డ్రెస్సులు

గజ్వేల్, జూన్ 28 : గజ్వేల్‌లోని ఎడ్యుకేషన్ హబ్‌లో చదువుకునే హాస్టల్ విద్యార్థులకు నేటికీ పూర్తిస్థాయిలో పుస్తకాలు, డ్రెస్‌లు అందలేదని, త్వరగా అందజేసే విధంగా అధికారులు చూడాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండస్వామి అన్నారు. శుక్రవారం విద్యాహక్కుల ఉద్యమంలో భాగంగా ఎడ్యుకేషన్ హబ్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన హబ్‌లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆడిటోరియాలను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చూడాలని, దాంతో విద్యార్థులు సెమినార్లు నిర్వహించుకునేందుకు వీలుంటుందన్నారు. హాస్టల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉంటుందని, దీంతో విద్యార్థులు తినలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను కలిసిన డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి

మద్దూరు తహసీల్దార్‌గా సంజీవ్‌కుమార్

మద్దూరు(ధూళిమిట్ట),జూన్ 28 : మద్దూరు తహసీల్దార్‌గా సంజీవ్‌కుమార్ స్థానిక తహసీల్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మద్దూరు తహసీల్దార్ అనంతరెడ్డి బదిలీపై అక్కన్నపేట తహసీల్దార్‌గా వెళ్లగా అక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సంజీవ్‌కుమార్ మద్దూరు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

అనంతరెడ్డికి ఘన సన్మానం

మద్దూరు తహసీల్దార్‌గా పనిచేసి అక్కన్నపేట తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లిన అనంతరెడ్డిని స్థానిక తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన సహచర ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వివరించారు.

బదిలీపై వెళ్లిన తహసీల్దార్ అనంతరెడ్డిని సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

తైబజారు వేలం వాయిదా

కొమురవెల్లి, జూన్ 28 : కొమురవెల్లి గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించాల్సిన అంగడి (వారంతపు) తైబజారుతో పాటు చెరువు పార్కింగ్, సులభ్ కాంప్లెక్స్ వేలం పాటను జూలై 1వ తేదీకి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి లోకేశ్‌రెడ్డి తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు గ్రామపంచాయతీకి ఎలాంటి బాకాయి ఉండవద్దని, ఆసక్తిగల వారు ఆయా విభాగానికి కేటాయించిన డిపాజిట్ మొత్తాన్ని చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ఆయన సూచించారు.

ఏవోగా ఎంపికైన భానుశ్రీ

భానుశ్రీ(ఫైల్)

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 28: మద్దూరు మండలంలోని నర్సాయపల్లికి చెంది న బద్దిపడిగె హన్మంతరెడ్డి చిన్న కూతురు భానుశ్రీ ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్రికల్చర్ ఆఫీసర్(ఏవో) పరీక్షలో 109 ర్యాంకు సాధించి ఏవో ఉద్యోగానికి ఎంపికైంది. ఏవో ఉద్యోగం సాధించిన భానుశ్రీని కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

స్నేహితుల చేయూత

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 28 : కొండపాకకు చెందిన కొమ్ము బాలయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన బాలయ్యకు తోటి డైవర్లు అండగా నిలిచారు. కొండపాక హనుమాన్ ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ సభ్యులందరూ కలిసి రూ.30 వేలు సాయం చేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ యూనియన్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్

నారాయణరావుపేట, జూన్ 28 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య ఆరోపించారు. శుక్రవారం నారాయణరావుపేటలో బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 వేల పింఛన్ రూ.4 వేలు, రైతు భరోసా రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఏడు నెలలు గడుస్తున్నా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుతున్నదని మండిపడ్డారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చారని.. తక్షణమే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో ప్రతి గ్రామంలో నర్సరీ, వైకుంఠ ధామం, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామపంచాయతీల్లో నిధులు లేక గ్రామాలు కుంటుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, వైస్ ఎంపీపీ సంతోష్‌కుమార్, ఎంపీటీసీలు హరీశ్, దండు స్వప్నాప్రభాకర్, భాను, నాయకులు ఎల్లారెడ్డి, ఆంజనేయులు, కిషన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

కొమురవెల్లిలో నార్కొటెక్ డాగ్స్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ శ్రీను, పోలీస్ సిబ్బంది

కొమురవెల్లి, జూన్ 28 : గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని చేర్యాల సీఐ ఎల్.శ్రీను హెచ్చరించారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజా యి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల బ్లాక్ స్పా ట్లను గుర్తించడంతో పాటు పలు గ్రామాల్లో నార్కొటెక్ డాగ్స్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సమూలంగా నిర్మూలించే విధంగా ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొమురవెల్లి ఏఎస్సై రామ్మూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ

సిద్దిపేట కమాన్, జూన్ 28 : సిద్దిపేట పట్టణంలోని డీఎస్ఎం పాఠశాలలో శుక్రవారం పేద విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేసింది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మిద్దెల యాదగిరి, హెఎం అక్షయ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కరస్పాండెంట్ యాదగిరి

పశువులకు టీకాలు వేయించాలి

జగదేవ్‌పూర్ జూన్ 28 : పశువుల్లో వచ్చే లంపీస్కిన్ వ్యాధి నివారణకు తప్పకుండా టీకాలు వేయించాలని బీఎంసీయూ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మండలంలోని అలిరాజ్‌పేటలో శుక్రవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేయగా . పశువుల్లో వచ్చే ముద్ద చర్మ వ్యాధి నివారణకు రైతులు టీకాలు వేయించారు. ఈసందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే నెల 10 వరకు మండలం వ్యాప్తంగా శిబిరం కొనగసాగుతుందన్నారు. తెల్లపశువుల్లో ప్రాణాంతకంగా మారిన లంపిస్కిన్ వ్యాధి నివారణకు విధిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రాచమల్లరమేశ్, ఓఎస్ హరప్రసాద్, గోపాలమిత్ర యాదగిరి పాల్గొన్నారు.

అలిరాజ్‌పేటలో పశువులకు టీకాలు వేయిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

భక్తిరత్న పురస్కారానికి రామరాజు ఎంపిక

రామరాజు

గజ్వేల్, జూన్ 28: తెలుగు వెలుగు జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి జాతీయస్థాయిలో అందజేసే భక్తిరత్న మహానంది పురస్కారానికి గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపకుడు రామరాజు ఎంపికయ్యాడు. 25 ఏండ్లుగా ఆయన చేస్తున్న ఆధ్యాత్మిక సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

నిరుపేదలకు అండగా ఉంటాం

తొగుట,జూన్ 28: నిరుపేదలకు అండగా ఉంటామని ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జప్తిలింగారెడ్డిపల్లికి చెందిన రేణుక ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికాగా వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెకురు శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించా రు. శుక్రవారం నిమ్స్ దవాఖానలో ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కోఆర్డినేటర్, మాజీ సర్పంచ్ చెరుకు విజయ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిలువేరి రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో టెండర్లు

టెండర్లు నిర్వహిస్తున్న ఆలయ ఈవో తదితరులు

చేర్యాల, జూన్ 28 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం ఈవో బాలాజీ ఆధ్వర్యంలో పలు టెండర్లు ఖరారు చేశారు. మొత్తం 11 టెండర్లు ఖరారు కాగా, మరో ఆరు టెండర్లు వాయిదా పడ్డాయి. పూజా సామగ్రి, కొరమీసాలు, ఇతర మొక్కుబడి వస్తువుల విక్రయాలకు, పాదరక్షలు, లగేజీల నిర్వహణ, 3 టాయిలెట్ బ్లాకులు నిర్వహించేందుకు టెండర్లు నిర్వహించారు. ప్రసాదాల తయారీ ప్యాకింగ్ నిర్వహణకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బి.శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

హుస్నాబాద్‌టౌన్, జూన్ 28: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 8వ వార్డులో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ పనికిరాని వస్తువుల్లో నిల్వ ఉన్న వర్షపునీటిని పారబోయించారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయించడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇంటితోపాటు పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తడి, పొడిచెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ టి. మల్లికార్జున్ గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, హరితహారం సూపర్ వైజర్ జాలిగాం శంకర్, కౌన్సిలర్ మ్యాదర బోయిన వేణు, కోఆప్షన్ సభ్యురాలు కాశబోయిన లలిత, బేసిల్‌ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉదయ్, వార్డు అధికారి, ఆర్పీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గాజెలో ఉన్న వర్షపునీటిని పారబోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌లో జంక్షన్ల అభివృద్ధి

హుస్నాబాద్‌టౌన్, జూన్28: పట్టణంలోని పలు చౌరస్తాల్లో జంక్షన్ల అభివృద్ధి కోసం ప్రైవేట్ ఏజెన్సీతో కలిసి అధికారులు శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని గాంధీచౌరస్తా, నాగారం రోడ్‌లోని మారుపాక రాజయ్య విగ్రహం, కరీంనగర్‌రోడ్‌లోని వై జంక్షన్లను అభివృద్ధి చేయాలని ఇటీవల బీసీ సంక్షేమశాఖ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు ఏజెన్సీకి చెందిన బృందం పలు ప్రాంతాలను సందర్శించి సర్కిళ్ల అభివృద్ధిలో ఎంతమేరకు రహదారిని విస్తరించాలనే దానిపై ఆర్అండ్‌బీ అధికారులను సంప్రదించారు. పట్టణంలోని గాంధీచౌరస్తానుంచి మల్లెచెట్టువరకు నాలుగులైన్ల రహదారిలో జంక్షన్ ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై చర్చించారు. స్వతరమే ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశాలమేరకు వారు ఆయా ప్రాంతాల్లో పర్యటించినట్లు తెలిసింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్, రెవెన్యూ ఆర్ఐ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ బృందంతో గాంధీచౌరస్తాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

సిద్దిపేట, జూన్ 28: బొగ్గుగనుల వేలం పాటను వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆపివేయాలని .. బొగ్గు గనులను నేరుగా సింగరేణికి కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం పిలుపు మేరకు బొగ్గు గనుల వేలం పాటకు నిరసనగా శుక్రవారం సిద్దిపేటలోని కొత్త బస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రం ప్రైవేట్‌పరం చేస్తున్నదని మండిపడ్డారు. బొగ్గుబ్లాక్‌లను ప్రైవేట్‌పరం చేయకుండా వాటిని సింగరేణి కంపెనీకి కేటాయించాలన్నారు. వేలంపాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించడం సరికాదన్నారు.. రాష్ట్రం నుంచి కేంద్ర గనులశాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం పాటను ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. పదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం దాదాపు 200 బొగ్గు బావులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టిందని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కనుమరుగవుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, చొప్పరి రవికుమార్, నాయకులు దాసరి ప్రశాంత్, శిరీష, సంజీవ్, రవీందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, తాడూరి భరత్, అభి, కళావతి పాల్గొన్నారు.

సిద్దిపేటలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

అనుమతి లేని స్కూల్‌ను సీజ్ చేయాలి

సిద్దిపేట అర్బన్, జూన్ 28 : సిద్దిపేట పట్టణంలో ఎలాంటి అనుమతి లేకుండా నడుపుతున్న మాడ్యులస్ స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్యాసంస్థలు ప్రారంభమై 20 రోజులు అవుతున్నా.. అనుమతి లేకుండా అడ్మిషన్లు ఇవ్వడం సిగ్గు చేటని.. అయినా విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. మాడ్యులస్ పాఠశాల యాజమాన్యం వ్యాపారస్తులకు యూనిఫామ్స్, పుస్తకాలు ఇచ్చి అమ్మిస్తున్న పరిస్థితి ఉందన్నారు. 20 రోజులుగా స్కూల్ నడుస్తున్నా విద్యాశాఖ అధికారులు సోదాలు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సంజీవ్‌కుమార్, నాయకులు భరత్, అభి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ములుగు, జూన్ 28 : ములుగు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం చైర్మన్ బట్టు అంజిరెడ్డి అధ్యక్షతన శనివారం ఉదయం 10 గంటలకు ములుగు రైతు వేదికలో నిర్వహించనున్నట్లు ముఖ్య కార్యనిర్వహణాధికారి రమేశ్‌బాబు తెలిపారు. రైతు భరోసా అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి రైతుల సలహాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

ఫలితాలు విడుదల

సిద్దిపేట అర్బన్, జూన్ 28 : టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 183 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 167 మంది ఉత్తీర్ణత సాధించి.. 91.25 ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వార్షికోత్సవ పూజలు

సిద్దిపేట అర్బన్, జూన్ 28: మండలంలోని కిష్టసాగర్ గ్రామం శంకరమఠంలోని శారదా చంద్రమౌళీశ్వర ఆలయ వార్షికోత్సవ పూజలు శుక్రవారం జరిగాయి. చండీ హవనంతో పాటు అమ్మవారికి విశేష పూజలు,పాలాభిషేకం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదు

ఉద్యోగ విరమణ పొందిన పడాల రమేశ్‌ను సన్మానిస్తున్న ఎంఈవో నర్సమ్మ

రాయపోల్, జూన్ 28 : ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని ఉమ్మడి మండల విద్యాధికారి నర్సమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంసాగర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన పడాల కిషన్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి, వివిధ గ్రామాల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు ప్రవేశాలు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్28: మద్దూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో క్రీడా పాఠశాల ప్రవేశాలకు శుక్రవారం బాలబాలికలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 26మంది బాలబాలికలు పాల్గొనగా పది మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారిని నేడు జిల్లా స్థాయిలో జరిగే ఎంపిక కోసం పంపించనున్నట్లు ఎస్ఎజీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎస్ హెచ్ఎం. చంద్రశేఖర్, పీడీ దామెర ప్రేమ్‌కుమార్, పీఎస్ హెచ్ఎం శ్రీశైలం, సీనియర్ క్రీడాకారుడు పిడిశెట్టి గౌరీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరికీ సభ్యత్వం కల్పించాలి

సిద్దిపేట కమాన్, జూన్ 28 : సిద్దిపేట పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న వైశ్య సంక్షేమ సమితిలో అందరికీ సభ్యత్వం కల్పించాలని సిద్దిపేట ఆర్య వైశ్యులు కోరారు. శుక్రవారం సిద్దిపేట వైశ్య నాయకులు తొడుపునూరి వెంకటేశం, కొమురవెల్లి వెంకటరమణ, మాచర్ల దుర్గాప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన భవనంలో వైశ్య కులంలో ఉన్న ప్రతి ఒక్కరికీ (రూ.1,116 నిర్ణయించి) సభ్యత్వం ఇవ్వాలన్నారు. ఈ విషయమై వైశ్య సంక్షేమ సమితి పెద్దలు స్పందించకపోతే భవిష్యత్‌లో ఉద్యమాన్ని ఉధృతం చేసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు.